# 5

# పోరు

## లచ్చిందేవి

(రచనా కాలం 1982)

**'ల**చ్చిందేవక్కా' అంటూ పిలుపు వినబడింది.

ఆకు కత్తిరిస్తున్నదల్లా అటు చూసింది. చంకలో పిల్లతో లక్ష్మి

"అబ్బో ఇయ్యాల ఎట్లెట్లనో మా ఇంటికచ్చినవేమే" అంది సాదరంగా లచ్చిందేవి.

"హగో! నువ్వింక ఆకు కత్తిరిత్తున్నవా? దేశమంత సమ్మె అని అంత మొత్తుకుంట ఉంటే ఇంక మీరు బీడీలు జేత్తున్నరు. మనం గూడ సమ్మెజేయాలె."

అంత భరోసా మాట అన్నాక కన్పిస్తే తప్పకుండా తిడుతుందని బీడీల గుల్ల అక్కడే ఉంచి దస్తీలో కట్టిన బీడీల మూటను చేతులు వెనుకకు పెట్టుకుని మెల్లిగా నవ్వుతూ కడప దాటబోయాడు శేఖర్. "మల్లస్తనే" అనుకుంటూ.

"ఎటురా?" అని చూసేసరికి లక్ష్మికి బీడీల దస్తీ కనిపించింది.

"అరేయి. ఇట్రారా!" అని గట్టిగా అరిచి పిలిచింది లక్ష్మి.

"పాశాకు మిగిలితే చేసిన" సంజాయిషీగా చెప్పాడు శేఖర్.

"సందివినెం గదర సాకలి సదువు. ఎందుకుర నీ సదువు? అవుతల మేమంత సమ్మె జేత్తంటే నువు బీడీలు చేత్తున్నావు? సిగ్గు లేదుర? తెలివి లేదుర? గందుకే ఊకెపరీక్షల ఫేలవుతున్నావుర?" అని ఉతికి జాడించింది లక్ష్మి.

"మా కంపిన్ల ఎవరు బందు వెట్టలె" తనను తాను సమర్థించుకుంటున్నట్టుగా అన్నడు శేఖర్.

"అయితే సవాయికి ఆకేత్తరట మేం బందుంటె మీ కంపినోనికి బీడీ ఎక్కొగుంజుతుందని! చేత్తవ సవాయికి! గాడిది!... మీ కంపినోల్లందరు బీడీలు

జేత్తె నువు గూడ జేత్తవు. మరి గాల్లంత సమ్మె జేత్తున్నరు. మనం గూడ సమ్మె జెయ్యాలని ఎందుకు జెప్పలేదుర? సీ! నీకంటె ఆడి పోరగాన్లు నయంర! లగ్గం గాని పోరగాన్లుగా నిర్మల, సుగుణ, గావాల్లంత యిల్లిల్లు దిరిగి కంపిని బందువెట్టుమని చెప్తంద్రు. గా నారాయణ హెడ్డాఫీసుల నౌకరిడిసివెట్టి లచ్చినారి గాని తోటి కలిసి ఇద్దరు రికాం లేకుంట తిరుగుతున్రు. గా శంకరన్నయితే బియ్యే పస్టు  కిలాసుల పాసై గూడా నౌకరి దొరుకుతె గూడ అద్దని యిడిసిపెట్టి మన బీడీకారిగార్ల మేలు కోసం తిరుగుతుండు. సెయ్యాలంటె వెయ్యిరూపాయల నౌకరి దొరుకుతది శంకరన్నకు. చేసుకుంటా అని అంటె అవ్వల్‌దర్జగ పిల్ల దొరుకుతది. ఇల్లు ఈర్వాటం అన్ని ఇడిసివెట్టి దేశం మీద వడి యేగి దిరుగుతుండనుకున్నావుర? మనకోసం మన అసుంటోల్లకోసం! గాల్లను సూత్తెనన్న బుద్ధి రాలేదుర?"

"ఏందె లచ్చి! మా ఇంటికచ్చి గాని మీద పడితివి?" అంది లచ్చిందేవి.

"అక్క కొడుకయితే నా కొడుగ్గాడ? ఈన్ని నేను దిట్టకపోతె ఎవలు దిడుతరు? ఇది మందిల్లా? యిజ్జతు పోవుటానికి? బీడీలు జేసెటోల్లందరిది ఒకటే ఇల్లు."

"అబ్బో! మాటలు బాగా నేర్సినేమే" అని ఆశ్చర్యపోయింది లచ్చిందేవి. లలితకెయితిరిగి "దొవ్వాన పాలు తేపోయె." అని అంది.

"నేను చాయె యిపుడే తాగిన్నె" అంది లక్ష్మి. నానిగాడికి రొమ్ము నోట్లో కుక్కింది.

"అవ్వా!" అంటూ సరస్వతి గంతులేసుకుంటూ వచ్చింది. "రాకరాక అచ్చినవు! గీచాయె దాగుతె ఏమైతదె?" అని లలితకెయి తిరిగి "ఏమాయెనే  పో"" అని పూరమాయించిది.

తీరికగా శ్వాస పీల్చుకుంది లక్ష్మి. ఇల్లంతా కలియజూసింది. గోడకు జేరగిలబడి మంచంలో కాళ్ళు బార్లాజాపి నిస్సత్తువుగా ఇటే చూసీ చూడనట్టున్నాడు రంగయ్య.

మొదటే మాట్లాడనించనందుకు లక్ష్మి నాలిక కొరుక్కుంది.

"ఏంది బావా? జరమత్తందా?" కుశలమడిగింది.

"నేను జెప్తె ఇంటడా? వద్దు వద్దనంగ లగ్గాలు దింపిండు. పోయెటోడు వోక మమ్ముల్నందరిని తోల్కపోయె. ఫారంల అన్ని కాడాలై యిపుడేమొ బీడీల

పైసలు రాకపాయె. ఇగ నాల్రోజుల్నించి... గదె మీరు కంపిన్లు బందువెట్టుకుంట అత్తె బీడి గావాల్నని సవాయికి ఆకేత్తె ఆకు తెచ్చుకుని తెల్లందాక పొద్దుందాక నిద్రాగారం లేకుంట ఎగిర్తంగ బీడీలు జేత్తనంటె కాడాలైన పైసలత్తయా? తిరుగంగ తిరిగితిమి గని గీ నాల్రోజులు ఎగిర్తంబట్టి సవాయిజెయ్యంగనే అత్తయా పైసలు? నిద్రాగారం లేక నిన్నటినుంచి జరమందుకున్నది. సవాయి కూలి దీసింది." అంది లచ్చిందేవి.

"లగ్గాలకు పోకపోతె ఎట్ల? అందరు దగ్గరోల్లేనయిరి. పోకపోతె ఏమను కుంటరు. మనం ఆల్ల లగ్గానికోకపోతె ఆల్లు మన సావుకు గూడ రారు. మొన్న ఏమైంది? లచ్చాదికారైతేంది? పిల్లికి పిడుస ఎయ్యక పాయె. పెండ్లాం సత్తె ఎవలు మోసింద్రు. కైకిలి వెట్టి మోపిచ్చుకున్నడు. సవాయి యియ్యాల కొత్తగ జేత్తున్ననా? జెరమత్తదనుటానికి" అన్నాడు రంగయ్య ఆయాసంగా.

"రోజు రోజుకు వయసు వత్తందా? పోతందా? నిన్నున్నట్టు రేపుంటలేదు." అంది లచ్చిందేవి.

"బీడీలు జేసెటోల్లకు వయసు తోటి పని ఏంగాలిపోయిందితియి. పదేండ్లు జేసెటాల్లకు ఛే దగ్గు, పెయి మీది బొక్కలు దప్ప ఏం మిగులుతాంది పానంల? ఇది మార్వాలె! మనం గూడా అందరి తీర్గ బతకాలె. మనగ్గూడ కూలీలు వెరుగాలె. గిట్ల జరమొచ్చి పన్నపుడు జీతం గట్టియ్యాలె. దావుకాన్లు వెట్టి మనకు మందులు పైసల్లేకుంట సప్లయి చెయ్యాలే." ఎలా చెప్పాలా అని ఆలోచిస్తున్న లక్ష్మికి అవకాశం దొరికిందే తడువుగా తాను వచ్చిన పని చెప్పేసింది. మెల్లిగా జారుకో బోయాడు శేఖర్ మళ్ళీ. "మాపు ఇచ్చి మల్ల వస్త. రాజా రామన్న ఆలిసమైతే కోపానికత్తడు." అంటూ లేవబోయాడు.

"ఇయ్యాలట్నుంచి మీ కంపిని గూడ బందువత్తది. ఎందుకుర ఎగిర్తం?" అంది లక్ష్మి.

విధిలేక కూర్చున్నాడు శేఖర్. పాలు తెచ్చింది లలిత. పొయ్యిలో కట్టెలు దగ్గరికి జరిపి "గీ పాశాకు బీడీలు యిచ్చి రాపోయె." అంది లచ్చిందేవి లలితతో.

"మీ ఎంకటన్న కంపిని గూడా యియ్యాలట్నించి బందు వెట్టాలె. రామక్క గూడ మీ కంపినోల్లతోటి మాట్లాడి వద్దామని పోయింది." అంది లక్ష్మి లచ్చిందేవి వైపు చూస్తూ. హతాశురాలైంది లచ్చిందేవి పిడుగు పడ్డట్టుగా. రంగయ్యకు

గూడా నెత్తిన పిడుగు పడ్డట్టయి ఉలిక్కి పడ్డాడు. ఈ దెబ్బతో సగం జ్వరం జారినట్టయి చల్ల చెమటలు పుట్టాయి.

"మీరు బందు వెట్టింది చాలదా? అందరెందుకు?" అంది లచ్చిందేవి షాక్‌నుండి తేరుకోకుండానే. ఆ మాటతో అవాక్కయి పోయింది లక్ష్మి. ఏం చెప్పాలో ఒక క్షణం తోచలేదు. కొంచెం సేపు సోంచాయించింది.

"బావులు పెరుగాలె మనకు. ఆకు తుట్టివోయిందని పైసలు కొయ్యద్దు. సరిపోయేంత ఆకియ్యాలె. బోనసు పెంచాలె. జీతం కట్టి యిచ్చే సెలవులు ఎక్కొజెయ్యాలె. మనకు పానం మంచిగ లేకపోతె మందుల పైసలు కంపినోల్లె యియ్యాలె. గివన్ని అందరికి గావాలె. అందుకోసం మన అందురం సమ్మె జెయ్యాలె. మనందురం సమ్మె జేత్తె మన బలం తెలుత్తది. పెద్ద సేట్లు దిగి అత్తరు. మనందరి బాధలు తీర్తయి." సముదాయించింది లక్ష్మి.

"మీరైతే జేత్తున్నరు గదా! మీకయితే పెరుగనీ! మీకు పెరిగినంక మాకు పెరుగయా?" అంది లచ్చిందేవి. చాయె మరుగుతున్నది.

"గిసోంటియి ఒక్కల్లతోని గాదు. అందరం కలిసి కొట్లాడాలె."

"మరి అసోంటప్పుడు అందర్ని అడిగే సమ్మె మొదలు వెట్టనుంటిరి. మిమ్ముల ముందుగాల సమ్మె జెయ్యుమని ఎవలన్నరు? ముందుగాల అడుగుతె ఏమందుమో మేము. అది గూడ యిని సూడనుంటిరి. ఇపుడు పులి మీద పడ్డట్టు అచ్చి సమ్మె జెయ్యిమంటె మాకు ఇంట్ల తిండికి ఎల్లద్దా? మొగడో పని పెండ్లామొక పని చేసెటోల్లు ఎట్లనన్న సగవెట్టుకుంటరు. మేం ఇద్దురం యిదే పని మీద బతుకవడితిమి. మేం ఎనుక ముందు సూసుకోవద్దా? నాల్రోజుల్నించి ఉప్పిడి ఉపాసం ఉంటున్నం. లగ్గాలకంటపోతె పనివోయె. ముందుగాల చెప్తే మేం గూడ యింట్ల తిండికి సముదాయించుకుందుము గద!"

"ఔ ! నాకు పరీక్షలున్నపుడు సమ్మె జేత్తె మంచిగుండు." అన్నాడు శేఖర్.

"ఎనుక ముందు జూసుకోవడానికి ఎవలకేం ఉన్నది. ఆకలికి సావనైతె సావంగద? ఏన్నో ఓ కాడ అప్పు అయితంగని." అంది లక్ష్మి.

"నీకేందే? నీ మొగుడు దుకాన్ల గుమస్తా. ఏ సావుకారైన నమ్ముతడు. నా మొగుడు నా తీర్గ బీడీలె చెయ్యవట్టె. మాకు అప్పు ఎవలిత్తరు. మీకు సాగినట్టు

మాకు సాగుతదా? గా కంట్రోలు శక్కర కొనుక్కొందామంటె పైసలు లేకపాయె. జరమత్తె డాక్టరు దగ్గరికోవుటానికి పైసల్లేక గల్లగురిగిలేసిన పైసలు దీసిన. ఇంతకన్న యింక ఏం జెప్పుమన్నవే? యాడాదంత పనిచేసి మొన్న లగ్గాలప్పుడు పదిపదిహేను రోజులు తిరుగుతె బీడీల పైసలు వచ్చేటియి లేక తిండికి కటకట గావట్టె. మీవోల్లు సమ్మెజేత్తున్నరని మాకు సవాయికేత్తే నాల్రోజులు జేసి మంచం నెయ్యవట్టె. ఇద్దరం బీడీల మీద బతికెటోల్లమేనయితిమి. మాకు ఎట్లెల్లుతదే? మీ అసుంటోల్లకేంది? మొగడో పని పెండ్లామొకపని జేసుకుంట సంసారం ఎట్లనన్న ఎల్లదీసుకుంటరు.

"మాకు గీ బీడీలే గతి అయె. నా మొగుడు నీ మొగుని తీర్గ ఏదన్న దుకానంల జీతముంటె నేను గూడ నీ తీర్గ సమ్మె జేద్దు. నా మొగుడు మ్యాదకుడాయె. బీడీల కంపిన్ల జీతం అంట ఉంటె ఆకు బాగ తుట్టివోగొటట్టిండని రెన్నెల్ల జీతం టేకెదారు కోత్తె నీయవ్వ నౌకరి అని అదిడిసివెట్టె. హెడ్డాఫీసుల జీతం ఉంటె ఆ లెక్కలు రాకపోయె. దాదాగాని ఎంగిలి గిలాస కడుగ బుద్దిగాక పౌరుషమచ్చి అది యిడిసివెట్టె. పాన్ టేల అంట పెట్టె. అచ్చినోనికి పుచ్చినోనికి నమ్మి కాతా పెట్టె. బట్టలు కుట్టుడు అంట నేర్చుకొనవోతే గంత పెద్దోనికి కాజాలు కుట్టనేర్పె సిన్న పోరని తీర్గ. మల్లగిదే సాట గతి ఆయె. ఇద్దరం బీడీలు జేసెటోల్లమయి పోతిమి. ఇంటెనుకపెరడున్నదా? అయ్యవ్వలు సంపాదించిన పొలమున్నదా? పండింది దినుకుంట సమ్మె జేసుటానికి. చేసుకుంటె కుండ గాలె. లేకుంటె కడుపు గాలె.

"అయినా నిరుడు పదిహేను రోజులుపని బందు వెడ్తిమి. బావులు పెరుగుతయంటిరి. అన్ని కానున్ ప్రకారం వస్తయింటిరి. పెరిగినయి పెరిగినయి అంటిరి. పెరిగిన బావులు అత్తనే ఉన్నయి! తిననే వడ్తిమి, మల్ల యిపుడో సమ్మె అనవడితిరి. ఇంతకు ముందు నిర్వాకం జేసిన్రని మల్ల పని బందువెట్టుడా?" ఏకబిగిన వ్యధలన్నీ బాధల్ని, జీవితాన్నీ తలపోసుకుంటూ నిరాశా ఆవేశంతో ఉపన్యామే ఇచ్చింది. లచ్చిందేవి.

అందరికీ చాయె యిచ్చింది లచ్చిందేవి. ఒక్కబుక్క తాగి అందుకుంది లక్ష్మి.

"ఇంతకు ముందటి సమ్మెలన్ని లీడర్లు ముంగటుండి చేపిచ్చిన్రు. చెయ్యి అంటె చేసినం. అద్దంటె ఊరుకున్నం. పెరుగుతది పెరుగుతది అంటె నమ్మినం.

సాటకు రెండు అడిగితె ఇచ్చినం. మనను నమ్మిచ్చి సమ్మె జేపిచ్చి, మనను అడ్డం బెట్టుకుని సేట్లను, టేకెదార్లను బెదిరిచ్చుకుంట లంచాలు దీసుకున్నరు లక్షలకు లక్షలు. ఏమన్న ఎవలన్న అది తెలిసి గట్టిగ అడుగుతె మన పార్టీకే చందా ఇచ్చిండు అని చెప్పి లెక్కజూపక మింగిన్రు.

అందుకే లీడర్లంత బంగ్లలు కట్టుతున్నరు. మన బీడీలోల్ల కోసం కొట్లాడు టానికి అని ఎలచ్చన్ల ఎమ్మెల్లేగ నిలవడుటానికి అని సాటకు రెండు వసూలు జేసి మన పైసలతోటి పేరుపెద్దిరికం సంపాయించుకొని, పార్టీల అబ్బో బాగానే పనిచేత్తున్నడురో అనిపిచ్చుకుని ఆల్ల కొడుకులను రస్యాకు పంపిచ్చుకున్నరు. పేరు వాల్లదయింది. పైస మనదయింది.

అన్నందుకు ఏదో యింత పెరుగాల్నని పావులో ఆఠాన్నో పెంచిపిచ్చిన్రు. లేకపోతే లీడర్ల మీద కారిగార్లకు నమ్మకం చెడిపోతదని. అట్ల సెడిపోతె కారిగార్లు ఎవలకు యినకుంట అయితే యింకా కష్టమయింతదని సేట్లే ఏదో యింత అని పెంచిన్నాడు పెరిగినయి లేన్నాడు లేదు. నిరుడు బావులు పెరిగినయని యిటు అన్నరు అటు హైకోర్టుల పెరుగకుంట సేట్లు కేసు వెట్టిన్రు. యిగ ఆ పాత లీడర్లు కుయ్యిమంట లేరు కయ్యిమంటలేరు."

మరో గుక్క చాయి తాగి మల్లీ అందుకుంది లక్ష్మి.

"ఈ సమ్మె అసోంటి పాత లీడర్లు, సాటకు రెండు వసూలు జేసెటోల్లు జేపిత్తున్నది గాదు. మనకు మనమే జేత్తున్నది. ఆకు తుట్టివోయిందని, గంప ఛాటన్ ఎక్కో అయిందని పైసలు పంచినప్పుడల్ల పదో అయిదో కోస్తనే ఉన్నరు టేకెదార్లు. గది అద్దన్నం. గీ దీనికి ఏ లీడరు అచ్చి సమ్మె జెయ్యిమని చెప్పలేదు! కడుపు గాలినోల్లంత రామక్క చెప్పంగనే పని బందు వెట్టిన్రు. మేం పని బందు వెట్టుడు జూసి అంత ఎట్లనో ఉన్నది అని మిగిలిన కంపినోల్లు పైసలు ఏం కోసు కోకుంట మొత్తం పంచిన్రు. మాకు పని పోతేపోయింది. గని మిగిలినోల్లందరికి లాభమైతె అయింది గద! ఇది సమ్మె తోటి జరిగిన లాభం కాదా? ఒక్క కంపి నోల్లతోనే గింత లాభం జరిగింది. అందరం కల్సి సమ్మె జేత్తె లాభం ఉండదంటవ? సమ్మె జెయ్యకున్రి అని పాత లీడర్లు అనుకుంట సేట్ల సంకల జొచ్చిన్రు. హైకోర్టుల పోయి కొట్లాడ్తం అన్నరు. అయిన గూడ యినక మనం సమ్మె జేత్తన్నం.

ఇపుడు సేట్లు ఎట్ల బయపడుతున్నరో మీకు తెలుస్తలేద? మీకు అడిగినంత ఆకెయ్యవట్టిరి. ఛాటన్ చేసుడు తక్కోజేసిరి. సవాయికెయ్యవట్టిరి. అయితె గీ దీనికె సంబరపడితె మనం మల్ల బొందల వడ్డట్టె. మనకు బావులు వెరుగాలె. కారిగార్లకు గూడ వేరే దావుకాన్లు వెట్టాలె.

గా సర్కారు నౌకరిగాల్లకు ధరలు పెరిగినప్పుడల్ల జీతం బత్తా పెంచుతున్నరట. మనకు గట్ల పెరుగాలె. సిమెంటు కంపిన్ల పనిజేసెటోల్లకు కట్టిచ్చినట్టు మనకు క్వార్టర్లు ఎందుకు కట్టియ్యద్దు? సర్కారు నౌకరు జేసెటోల్లకు సస్తె పదివేలిచ్చినట్టు మనం సస్తె మన పోరగాల్లకు పదివేలు ఎందుకియ్యద్దు? మన పోరగాన్ల లగ్గాలకు సర్కారు నౌకరిగాన్లకు ఇచ్చినట్టు అప్పు ఎందుకియ్యద్దు?"

శ్వాస తీసుకుని చల్లారిపోయిన చాయెని గటగటా తాగేసింది లక్ష్మి. తన ఉనికినే గమనించనట్టు ఉపన్యాసం ఇస్తున్నందుకు అసహనంగా అటూ ఇటూ కదిలాడు రంగయ్య.

**రత్నమాల సంపాదకత్వంలో**
**వెలువడిన నూతన మాసపత్రిక, జనవరి1983.**